సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



పనులు అడ్డుకుంటాం..

భూములు కోల్పోయిన తమకు, మార్కెట్ రేటు ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, లేకపోతే పిప్పల్‌కోటి నిర్మాణ పనులను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌కు ఎడ్లబండ్లతో తరలివచ్చారు. 8లో▸



కేసుల్లో సరైన పరిశోధన చేపట్టాలి

కేసుల్లో సరైన పరిశోధన చేపట్టాలని ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
36.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సేవాలాల్ జయంతి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

కైలాస్‌నగర్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో వేడుకల నిర్వహణపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వేడుకలను బంజారా సంప్రదాయ పూజలతో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే వారికి ఆర్టీసీ ద్వారా అదనపు బస్సులు సమకూర్చాలని సూచించారు. మౌలిక వసతులతో పాటు శాంతి భద్రతలు, వాహన పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. హాజరైన వారందరికీ భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, డీఆర్డీవో కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్‌గా రమేశ్



రోకండ్ల రమేశ్

ఆదిలాబాద్‌టౌన్: రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్‌గా రోకండ్ల రమేశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న అడ్డి భోజారెడ్డి ఇటీవల డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో జైనథ్ మాజీ ఎంపీపీ రమేశ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రైతుబంధు సమితి జిల్లా సభ్యుడిగా గడ్డం జగదీశ్‌రెడ్డిని నియమించారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదల సంక్షేమం



పాదయాత్రలో పాల్గొన్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు చేకూరిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌ను వివరిస్తూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు, పట్టాలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. 2014 తర్వాత పేదలకు ఇంటి స్థలం పంపిణీ చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలతో పాటు ఇంటి స్థలం లేనివారికి స్థలం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, ముబారక్, ఆనంద్‌రావు, చరణ్‌గౌడ్, రాహుల్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్సెస్సీ ప్రీఫైనల్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు ఈనెల 22 నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత, డీసీఈబీ కార్యదర్శి గజేందర్ ప్రకటనలో తెలిపారు. 22న ప్రథమ భాష, 24న ఇంగ్లీష్, 25న గణితం, 26న సామాన్య శాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, మార్చి 1న ద్వితీయ భాష పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. విషయాన్ని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు గమనించాలని సూచించారు.

రేపటి నుంచి డీఎడ్ ఫస్టియర్ పరీక్షలు

డీఎడ్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విషయాన్ని ఛాత్రోపాధ్యాయులు గమనించాలని సూచించారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్యే జోగు రామన్నపై బీజేపీ నాయకుల అసత్య ఆరోపణలు సరికాదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జైనథ్ మండలంలోని తరోడ బ్రిడ్జి కుంగిపోవడంపై బీజేపీ నాయకులు విషయ పరిజ్ఞానం లేకుండా ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. భోరజ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.490 కోట్లతో డీపీఆర్ పూర్తయిందని, అందులో తరోడ బ్రిడ్జికి రూ.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పనుల్లో జాప్యం చేస్తుంటే ఎమ్మెల్యేపై బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. సమావేశంలో ప్రహ్లాద్, రమేశ్‌పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట బైఠాయించిన ఆదివాసీలు

తుడుం మోత

- ఉద్రిక్తంగా మారిన ఆదివాసీల ఐటీడీఏ ముట్టడి
- కార్యాలయంపై ఆందోళనకారుల రాళ్ల దాడి
- కిటికీ అద్దాలతో పాటు ఓ వాహనం ధ్వంసం
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు
- ప్రభుత్వం దృష్టికి ఆదివాసీల సమస్యలు : ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్: అస్తిత్వం కోసం ఆదివాసీలు పోరుబాట పట్టారు. ఎస్టీ జాబితాలో కొత్తగా 11 కులాలను చేర్చడంపై సర్కారు తీరును నిరసిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉట్నూర్‌కు సోమవారం భారీగా తరలివచ్చి ఐటీడీఏను ముట్టడించారు. కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఓ వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళన ఓ దశలో ఉద్రిక్తంగా మారింది. జిల్లా ఎస్పీతో పాటు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చి..

ఇటీవల ప్రభుత్వం ఇతర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడంతో ఏజెన్సీ వ్యాప్తంగా ఆదివాసీల ఆందోళనలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా తుడుందెబ్బతో పాటు ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది ఆదివాసీ తెగలకు చెందిన అనుబంధ సంఘాలు ఐటీడీఏ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ క్రమంలో వారంతా సోమవారం మధ్యాహ్నం భారీగా ఉట్నూర్‌కు చేరుకొని ఐటీడీఏ ఎదుట బైఠాయించారు. సంఘం నాయకులు మాట్లాడుతుండగానే ఒక్కసారిగా ఆదివాసీలంతా కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే యత్నం చేశారు. ఓ వ్యక్తి ప్రధాన గేటు దూకుతుండగా పోలీసులు వారించారు. ఈ సమయంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావు వాహనం ఐటీడీఏ నుంచి బయటకు వస్తుండగా కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే కార్యాలయంపై రాళ్ల దాడి చేయడంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని అదుపుచేసే యత్నం చేశారు.



ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ప్రాజెక్టు అధికారి రావాలంటూ పట్టు..

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదంటూ ఆదివాసీలు పట్టుపట్టారు. నిర్మల్ కలెక్టర్, ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా ఉన్న వరుణ్‌రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులందరికీ పోడు హక్కు పత్రాలు లభిస్తాయన్నారు. పీవో హామీతో వారు శాంతించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి బాపురావు, నాయకులు పాండురంగ్, మైపతి, అరుణ్‌కుమార్, ఉయిక సంజీవ్, రేణుక, పుష్పరాణి, ఉయిక ఇంద్ర, వెంకటేశ్, మాధవ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్లను తొలగిస్తున్న ఆందోళనకారులు



ధ్వంసమైన కారు అద్దాలు

శాంతియుతంగా పరిష్కరించుకోవాలి: ఎస్పీ

ఆదివాసీలు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఐటీడీఏ ముట్టడి ఉద్రిక్తంగా మారడంతో ఆయన అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమించాలని సూచించారు. తమతో కలిసి వస్తే సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయొద్దు..

ఐటీడీఏ ముట్టడిలో చోటు చేసుకున్న ఉద్రిక్తత నేపథ్యంలో ఎలాంటి కేసులు నమోదు చేయలేదని సీఐ సైదారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. సంఘటనపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అస్తిత్వం కోసమే పోరాటం..: తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య

రాష్ట్ర ప్రభుత్వం 11కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడం ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేయడమేనని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చట్టబద్ధత లేకుండా ఎస్టీలుగా కొనసాగుతున్న లంబాడాల కారణంగా తమ హక్కులను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే తమ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములకు షరతులు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు పెసా, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జీవోనం.3ను యథావిధిగా అమలు చేయడంతో పాటు ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీవోను పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఆదివాసీ బంధు ప్రకటించడంతో పాటు దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీతో భూములు కోల్పోయిన ఆదివాసీలను ఆదుకోవాలన్నారు.

27 నుంచి శనగ కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలు
- రూ.5,335 మద్దతు ధర



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నటరాజ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఈనెల 27 నుంచి శనగ కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ నటరాజ్ తెలిపారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోళ్లకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో శనగ పంట సాగైందని, దాదాపు 7లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.5,335 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో రూ.4600 నుంచి రూ.4700 వరకు మాత్రమే ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్, బేల, జైనథ్, ఇచ్చోడ, నార్నూర్, బోథ్, ఇంద్రవెల్లి, తాంసిలలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరం మేరకు సిరికొండలో కూడా కేంద్రం ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మార్క్‌ఫెడ్ డీఎం గౌరి నాగేశ్వర్ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలోకి 11 కులాలను చేర్చవద్దు


ఇంద్రవెల్లి: ఎస్టీ జాబితాలో మరో 11 కులాలను చేర్చేందుకు సీఎం కేసీఆర్ శాసనసభ సమావేశాల్లో చేసిన ప్రకటనను వెంటనే విరమించుకోవాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం నివాళులర్పించి ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడికి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న వలస లంబాడాలను తొలగించాలని ఇప్పటికే పలు దఫాలుగా ఆందోళనలు చేపట్టామన్నారు. అయినా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై వివక్ష చూపేడుతూ చర్యలు చేపట్టక పోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. తుడుందెబ్బ జిల్లా నాయకుడు ఉయిక సంజీవ్, డివిజన్ అధ్యక్షుడు బారిక్‌రావ్, మండల అధ్యక్షుడు భరత్, తదితరులున్నారు.

22న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈ నెల 22న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజరెడ్డి,పిట్ల రాజేశ్ ప్రకటనలో తెలిపారు. అండర్–14,16,18,20 విభాగాల్లో బాల బాలికలకు 400మీటర్ల పరుగు పోటీ, అలాగే అండర్–18(యూత్‌అథ్లెటిక్స్)లో బాలబాలికలకు అన్ని ఈవెంట్స్‌లలో వేరువేరుగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 25, 26 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులుబర్త్‌సర్టిఫికెట్ లేదాఎస్సెస్సీ మెమో, ఆధార్ తీసుకొని ఉదయం 8:30 గంటలకు స్టేడియంలోరిపోర్ట్ చేయాలని సూచించారు. రూ.50 ఎంట్రీ ఫీజు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9492136510లో సంప్రదించాలని కోరారు.

అర్జీదారులకు లిఖితపూర్వక సమాచారమివ్వాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అర్జీదారులు ఒకే సమస్యపై ప్రజావాణికి పలు మార్లు రాకుండా వారికి స్పష్టమైన లిఖితపూర్వక సమాచారం అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎన్.నటరాజ్‌తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దరఖాస్తుదారు తన సమస్యకు సంబంధించిన అర్జీని సమర్పించినపుడు దాన్ని పరిశీలించి ఆయా శాఖల అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారమవుతుందా లేదా అనే విషయాన్ని దరఖాస్తుదారుడికి లిఖితపూర్వకంగా అందించాలన్నారు. అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను ప్రజావాణి వెబ్‌సైట్‌లో వారం లోగా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈవో బి.గణపతి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కైలాస్‌నగర్: కరోనా సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పనిచేసిన పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలనే డిమాండ్లతో పంచాయతీ కార్మికులు ఈ నెల 12న పాలకుర్తి నుంచి చేపట్టిన రాష్ట్ర స్థాయి పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం జిల్లాలో పది కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. జైనథ్ మండలం భోరజ్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. జీవో నంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, తమకు 11వ పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్, ఆశన్న, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


'హాథ్ సే హాథ్ జోడో అభియాన్'కు ఇన్‌చార్జీలు

- ఉమ్మడి జిల్లాలో పలువురికి బాధ్యతలు అప్పగింత
- ఏఐసీసీ సభ్యులుగా మరోసారి పీఎస్సార్‌కు అవకాశం

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల/ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పార్టీ రాష్ట్ర కమిటీ ఉమ్మడి జిల్లాలో 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' కార్యక్రమ నిర్వహణ కోసం పది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం ఆ పార్టీ జనరల్ సెక్రెటరీలను ఈ కార్యక్రమ సమన్వయం చేసేందుకు నియమించారు. ఇందులో కొందరికి ఉమ్మడి జిల్లా నియోజకవర్గాలు, రెండేసి చొప్పున, మరి కొందరికి జిల్లా పరిధితోపాటు ఇతర జిల్లాలోని నియోజకవర్గాలకు కలిపి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జీలుగా నియమించిన వారంతా ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాల్సి ఉంది.ఉమ్మడిజిల్లా నుంచిప్రేమ్‌సాగర్‌రావుకు మరోసారి ఏఐసీసీ సభ్యులుగా అవకాశం కల్పించారు.

జనరల్ సెక్రెటరీ పేరు	నియోజకవర్గం
ఎం.జైపాల్‌రెడ్డి	సిర్పూర్, ఖానాపూర్
సత్తు మల్లేశ్	ఆసిఫాబాద్, బోథ్
జే.అనురుధ్‌రెడ్డి	నిర్మల్, ముథోల్
పి.హరికృష్ణ	ఆదిలాబాద్, నకిరేకల్
కే.రవణీరెడ్డి	చెన్నూరు, మంథని
ఎల్.ధన్వంతి	బెల్లంపల్లి, ధర్మపురి
జి.ఇందిరారావు	మంచిర్యాల

తరోడ బ్రిడ్జిని పరిశీలించిన ఎన్‌హెచ్ అధికారులు



కుంగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

జైనథ్: మండలంలోని తరోడ బ్రిడ్జిని ఎన్‌హెచ్ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ నర్సయ్య మాట్లాడుతూ.. బ్రిడ్జిలో మొత్తం 8స్పాన్‌లు(ఖానాలు) ఉండగా, ఒకదానికి పగుళ్లు తేలి కుంగిపోయింది. మరొకటి కూడా కొంత దెబ్బ తిన్నట్లు గుర్తించామన్నారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులు నివేదించనున్నట్లు తెలిపారు. ఈక్రమంలో బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ సుభాష్, ఏఈఈ భూపేష్ ఉన్నారు.

వంతెన మూసివేత

కైలాస్‌నగర్: కుంగిపోయి, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్న జైనథ్ మండలం తరోడ గ్రామం వద్ద గల వంతెనను మూసివేసినట్లు నేషనల్ హైవే అథారిటీ నిర్మల్ సబ్‌డివిజన్ డీఈ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాహనాలను జైనథ్ మండలంలోని నిరాల, అర్లి, లాండసాంగ్వీ మీదుగా ఆదిలాబాద్‌కు దారి మళ్లించినట్లుగా వెల్లడించారు.

క్లుప్తంగా

కూచిపూడిలో చిన్నారుల ప్రతిభ



నాట్యనంది పురస్కారంతో చిన్నారి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీకి చెందిన చిన్నారులు సంగారి ఆరాధ్య, దాయత్రి సహస్రలు కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శివోహం పేరిట నృత్యపోటీలు నిర్వహించారు. ఇందులో చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబర్చి నాట్యనంది పురస్కారం, ప్రశంసపత్రాలు అందుకున్నారు. కాలనీవాసులు, ఎస్వీఎస్, సెయింట్ థామస్ పాఠశాల ఉపాధ్యాయులు ఈ సందర్భంగా చిన్నారులను అభినందించారు. డ్యాన్స్ మాస్టర్ నవ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ



విజేతకు ట్రోఫీ అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్, నిర్వాహకులు

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి)బైపాస్‌రోడ్‌లో నిర్వహిస్తున్న ఇర్ఫాన్ అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. మొత్తం 26 క్రికెట్ జట్లు పాల్గొని పోటీపడగా, ఫైనల్ మ్యాచ్‌లో నిజామాబాద్, భైంసా జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ జాబీర్‌అహ్మద్ విజేత జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన భైంసా జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సయ్యద్ ఇర్ఫాన్, ఎంఐఎం నాయకులు ఫైజుల్లాఖాన్, అమీర్ తదితరులు ఉన్నారు.

జిల్లా కళాకారులకు ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు



అవార్డులు అందుకుంటున్న కళాకారులు

ఎదులాపురం: జిల్లాకు చెందిన సంగీత కళాకారుడు మల్లెల కబీర్‌దాస్, గాయకుడు గట్ల స్వామి ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు-2023ని అందుకున్నారు. విస్డం చారిటబుల్ ట్రస్ట్ వారు సాహిత్య, సాంస్కృతిక, విద్యా, వైద్యం, క్రీడలు, కళలు, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి జాతీయస్థాయి అవార్డులు అందించారు. ఇందులో కబీర్‌దాస్, స్వామిలకు సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖులు వారికి అవార్డు అందించి, శాలువాతో సత్కరించారు.

పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటాం

- ప్రభుత్వానికి భూనిర్వాసితుల హెచ్చరిక
- ఎకరాకు రూ.20 లక్షలు చెల్లించాలి
- పిప్పల్‌కోటి నుంచి ఎడ్లబండ్లతో ర్యాలీగా.
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- మద్దతు తెలిపిన విపక్షపార్టీల నాయకులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విపక్ష నాయకులు, భూనిర్వాసితులు

కైలాస్‌నగర్/తాంసి: భూములు కోల్పోయిన తమకు, ప్రస్తుత ధరలకనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే నిర్మాణ పనులు అడ్డుకుంటామని పిప్పల్‌కోటి భూనిర్వాసిత రైతులు స్పష్టం చేశారు. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోయిన రైతులు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నారు. అయినా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహిస్తూ తమ ఆందోళనను ఉధృతం చేశారు. సోమవారం పిప్పల్‌కోటిలోని దీక్షాశిబిరం నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సి.సుహాసినిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేశ్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. గత ఐదేళ్ల కిందట అప్పటి కలెక్టర్ ఎకరాకు రూ.8 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామనే భరోసా కల్పించడంతో భూములు అప్పగించారన్నారు. ఇప్పటికి పరిహారం ఇవ్వకపోగా దాన్ని రూ.7 లక్షలకు తగ్గించడం సర్కారు దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. బ్యారేజీ నిర్మాణ వ్యయం ఏటికేడు పెంచుతూ గుత్తేదారుకు లబ్ధి చేకూర్చుతున్న ప్రభుత్వం రైతులకు పరిహారం తగ్గించి అన్యాయం చేస్తుందని మండిపడ్డారు.గత ఐదు రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలకు చీమ కుట్టినట్లైన లేదని మండిపడ్డారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అఖిలపక్ష రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రీ, లోకారి పోశెట్టి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25 ఎడ్లబండ్లు.. 100 మంది పాదయాత్రగా..

పిప్పల్‌కోటి నుంచి ఎడ్లబండ్ల ర్యాలీగా కలెక్టరేట్‌కు బయల్దేరారు. 25 ఎడ్లబండ్లతో పాటు 100 మంది పాదయాత్రగా చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ ర్యాలీకి పోచ్చేర సమీపంలో బీజేపీ జిల్లా నాయకురాలు సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, సీపీఎం జిల్లా నాయకుడు మల్లేశ్, రైతు సంఘం నాయకులు దత్తాత్రి నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రం సమీపంలో ఈ ర్యాలీకి సీపీఎం నాయకులు పూలను చల్లి స్వాగతం పలికారు. రైతులు సంతోష్, నసీరుద్దీన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ఎడ్లబండ్లతో వస్తున్న భూ నిర్వాసితులు

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు



ఎడ్లబండ్ల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

గ్రామం దాటాక ఎడ్లబండ్ల ర్యాలీకి అనుమతి లేదని భీంపూర్ ఎస్సై రాధిక సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. పోలీసులు, రైతులకు వాగ్వావాదం జరిగింది. శాంతియుతంగా ర్యాలీ చేపడుతామని అనడంతో పోలీసులు పది ఎడ్లబండ్ల ర్యాలీకి అనుమతి ఇచ్చారు. పిప్పల్‌కోటి నుంచి బండల్‌నాగాపూర్, కప్పర్ల, సావర్గాం, పోచ్చేర, రాంపూర్ గ్రామాల మీదుగా ర్యాలీ తీశారు. పోలీసుల కళ్లుగప్పి వివిధ గ్రామాల్లోని ఇతర రోడ్డుమార్గం గుండా ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలి



యూరియా బస్తా, నాగళ్లతో నిరసన తెలుపుతున్న రైతులు

నిర్మల్‌టౌన్: యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రైతుల భుజాన నాగలి, నెత్తిన యూరియా బస్తాలు మోస్తూ సోమవారం విన్నూతంగా నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లోకేశ్వరం మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారని ఏడీఏకు ఇదివరకే ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు గైని మురళీమోహన్, తిమ్మాపురం ముత్తన్న, దేవేందర్, మహీరాజ్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలప దుంగలు పట్టివేత

కడెం: మండలంలోని పాండ్వపూర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను సోమవారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో చోలే అనిత తెలిపారు. జన్నారం వైపు నుంచి కడెం వైపు స్విఫ్ట్‌కారులో కలప దుంగలు తరలిస్తున్నారని సమాచారంతో పాండ్వపూర్‌లోని చెక్‌పోస్టు వద్ద డీఆర్వో సిద్దార్థ, ఎఫ్‌బీవో అలీం మాటు వేశారు. వీరిని చూసి పారిపోతుండగా వెంబడించడంతో కారును వదిలి నిందితులు పారిపోయారు. రేంజ్ కార్యాలయానికి కారును తరలించి, పట్టుబడిన పది కలప దుంగల విలువ రూ.40,279 ఉంటుందని ఎఫ్ఆర్వో తెలిపారు.

కేశఖండనానికి వచ్చి అనంతలోకాలకు

- గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



ప్రసాద్ (ఫైల్)



గాయాలపాలైన సునీత

నేరడిగొండ: మనమరాలి కేశఖండనం పూర్తయిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఆరెపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామానికి చెందిన ప్రసాద్-సునీత దంపతులు. ఈనెల 16న బోథ్ మండలం కన్గుట్ట గ్రామంలో కూతురు రమ్య కుమార్తె కేశఖండనం ఉండడంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆరెపల్లి జాతీయ రహదారి వద్ద బైక్‌పై వెళ్తున్న వీరిని గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ప్రసాద్ (45) అక్కడిక్కడ మృతిచెందాడు. కాగా సునీత స్వల్ప గాయాలయ్యాయి. ప్రసాద్ తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ వాహనం తలపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. ఆ దారిగుండా వెళ్లే ప్రయాణికులు ఆ ప్రమాదాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన సునీతను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఆస్పత్రికి పంపించారు. తర్వాత సునీత తల్లి గ్రామమైన ఇచ్చోడ మండలం గేర్జం గ్రామానికి తరలించారు. అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, వీరు కోకస్‌మన్నూర్ గ్రామవాసులు. వీరు బతుకుదెరువు కోసం గత 30 ఏళ్ల క్రితం నిజామాబాద్‌కు వెళ్లినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉండగా, ఒక కూతురి వివాహం జరగగా, మరో కూతురు డిగ్రీ చదువుతున్నట్లు తెలిసింది. ప్రసాద్ మరణంతో బంధువులు రోధించిన తీరు కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

అనుమానాస్పదంగా బాలుడి మృతి



మృతుడు సందేశ్



మృతదేహం లభించిన వ్యవసాయ బావి

కుభీర్: అదృశమై కనిపించకపోయిన బాలుడు సోమవారం శవమై అనుమానాస్పదంగా మృతిచెందాడు. మండలంలోని గొడ్సర గ్రామంలోని వ్యవసాయ బావిలో మృతదేహం లభించింది. వివరాల్లోకి వెళ్తే.. గొడ్సర గ్రామానికి చెందిన లాయవార్ సందేశ్ (9) ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కనపించలేదు. కుటుంబీకులు కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా, గ్రామంలో బాలాజీ అనే వ్యక్తి పక్కన వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. సందేశ్ తల్లిదండ్రులు దత్తాహరి, రుక్మాబాయి. దత్తాహరి గత మూడు నెలల క్రితం చెరువులో ఎద్దులు కడుగుతూ ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. భర్త మృతితో రుక్మాబాయి తన తల్లిగారి ఇల్లు మహారాష్ట్రలోని అందుబోరిలో ఉంటోంది. సందేశ్ నాన్నమ్మ కాంతాబాయి వద్ద ఉండి భైంసాలో రెండో తరగతి చదువుతున్నాడు. నానమ్మ కాంతాబాయి, మేనత్త లావణ్య, ఆమె కుమారుడు కార్తీక్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కాగా, కుటుంబాల మధ్య ఆస్తి వివాదాలు, గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. సందేశ్ వ్యవసాయ బావిలోకి దిగడానికి మెట్లు లేవు. కుమారుడు మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి రుక్మాబాయి ఆరోపించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అంత్యక్రియల కోసం గ్రామానికి తీసుకువచ్చారు. రుక్మాబాయి, ఆమె బంధువులు కుభీర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇస్తేనే అంత్యక్రియలు చేస్తానని చెప్పడంతో కాపీ ఇచ్చారు. ఈ విషయమై ఏఎస్సై శివయ్యను ప్రశ్నించగా రుక్మాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నేరడిగొండ: మండలంలోని కుమారి శివారులోని మందబొగుడ గుట్ట పక్కన పేకాటఆడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ నారాయణ స్వామి తెలిపారు. వారి వద్ద నుంచి పేకాట ముక్కలతోపాటు రూ.1980 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను డయల్ 100 పోలీసులు సుధాకర్‌రెడ్డికి అప్పజెప్పినట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి

ఉట్నూర్‌రూరల్: మేకలు మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందింది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం.. మండలంలోని బీర్సాయిపేట పంచాయతీ పరిధిలోని భూపేటకు చెందిన పెంబి రాజన్న-వజ్రవ్వ (38) దంపతులు. కూలీ పనులు, మేకలు కాపలా కాస్తు జీవిస్తున్నారు. రోజు మాదిరిగానే సోమవారం వజ్రవ్వ మేకల కాపలా కోసం వెళ్లింది. గ్రామ సమీపంలో వ్యవసాయ బావిలో నీళ్ల తాగేందుకు వజ్రవ్వ దిగింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. తల్లి ఆచూకీ కోసం వెతికగా గ్రామ పొలిమేరల్లో బావి సమీపాన చెప్పులు కనిపించింది. ఇరుగుపొరుగు వారు బావిలో దిగగా శవమై కనిపించింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ ఇర్ఫాన్ (12) విద్యుత్ షాక్‌తో సోమవారం సాయంత్రం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వైఎస్సార్‌టీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అస్లమ్ కుమారుడు షేక్ ఇర్ఫాన్ పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆటలాడుకునేందుకు ఇంటి పైకప్పు మీద ఉన్న టైరు తీస్తుండగా సర్వీస్ వైరు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆ సర్వీస్ వైపు తెగి ఉండడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే బాలుడి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, అస్లమ్‌కు ఇద్దరు కుమారులు ఉండగా, మృతిచెందిన బాలుడు రెండో కుమారుడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- ట్రెయినీ కలెక్టర్ శ్రీజ



అర్జీలు స్వీకరిస్తున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. రైతుబంధు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావు, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, హెచ్‌వో సుదీర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

- గిరిజా కోళ్ల పెంపకానికి రుణం మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం సోయంగూడ గ్రామానికి చెందిన వెడ్మ చంపత్‌రావు కోరాడు.
- తమకు ఎడ్లబండి ఎద్దుల జతలు మంజూరు చేయాలని జైనూర్ మండలం మాని కొలాంవగూడకు చెందిన ఆత్రం భీంరావు, సిడాం భీంరావు, ఆత్రం మారు, సిడాం పారుబాయి, ఆత్రం మానిక్‌రావు, ఆత్రం లచ్చు విన్నవించారు.
- సీఎం గిరివికాసం పథకం కింద బోరుబావి, విద్యుత్‌మోటార్లు మంజూరు చేయాలని తలమడుగు మండలం పల్సి గ్రామానికి చెందిన సోయం సూర్యభాన్, మడావి జ్యోతిరాం అర్జీలు అందజేశారు.
- గాదిగూడ మండలం ఝరి నుంచి శివాలయం వరకు రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తుడు నిరంజన్ అర్జీ సమర్పించాడు.

కుస్తీమే సవాల్



విజేతను అభినందిస్తున్న గ్రామస్తులు



తలపడేందుకు సిద్ధమవుతున్న మల్లయోధులు

కుంటాల: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని ఓలా శివాలయ ఆవరణలో సోమవారం కుస్తీపోటీలు నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో మల్లయోధులు పాల్గొన్నారు. చివరి కుస్తీలో నాందేడ్ జిల్లాలోని ఉమ్రి తాలుక బిద్రాలికి చెందిన సాయినాథ్ విజేతగా గెలుపొందారు. రూ.5 వేల నగదుతోపాటు శాలువా కడియంను బహూకరించారు. నాందేడ్‌లోని శ్రీనగర్‌కు చెందిన దిగంబర్ రెండోస్థానంలో నిలిచారు. సర్పంచ్ కనీస్‌ఫాతీమా, ఎంపీటీసీ కట్టరవి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఐకేఆర్ (పీఏ) నాలం శ్రీనివాస్, ఆలయ, వీడీసీ చైర్మన్లు చిన్నన్న, విఠల్, గ్రామపెద్దలు ఎగ్గం నర్సింలు, హైమ్మద్ పాష, శరత్ గౌడ్, దేవిదాస్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కాలేయ క్యాన్సర్‌తో మృతి



దశరథ్ (ఫైల్)

పెంబి: కాలేయ క్యాన్సర్‌తో బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాయదారి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాయదారికి చెందిన రాథోడ్ సునీత-బిక్కు దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రాథోడ్ దశరథ్(17) గత రెండు నెలల క్రితం నుంచి కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందినా తగ్గలేదు. పేద కుటుంబం కావడంతో వైద్యానికి ఖర్చు చేసే ఆర్థిక స్థోమత లేదు. గతనెల క్రితం దశరథ్‌ను ఇంటికి తీసుకువచ్చారు. ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం మృతిచెందాడు.

చెట్టును ఢీకొన్న వ్యాన్

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ సమీపంలో సోమవారం ఓ ఐచర్ వ్యాన్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నుంచి మండలంలోని బాగాపూర్‌లో కర్జూజను లోడ్ చేసుకునేందుకు ఐచర్ వ్యాన్ వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో క్లీనర్ జుబేర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ముథోల్ ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని లోకేశ్వరం పోలీసులు తెలిపారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న అశోక్

లోకేశ్వరం: పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలని రాష్ట విద్యాశాఖ పరిశీలన బృందం సభ్యుడు పోరెడ్డి అశోక్ అన్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వాకాటి కరుణ ఆదేశాలతో మండల కేంద్రంలోని ఉన్నత, రాజూర, మన్మద్ ఉన్నత పాఠశాలలను బృందం సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన, సమాధాన పత్రాల మూల్యాంకనం, వారాంతపు పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పోరెడ్డి అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. సందేహాలంటే నివృత్తి చేసుకోవాలన్నారు. బృందం సభ్యులు ప్రతాప్, నారాయణవర్మ, రవిగౌడ్, జిల్లా మానిటరింగ్ అధికారి నర్సయ్య, ఎంఈవో చంద్రకాంత్, హెచ్ఎంలు రమేశ్‌కుమార్, మధుకర్‌రావు, అశోక్, ఉపాధ్యాయులు మల్కాగౌడ్, భూమేశ్, దేవేందర్ ఉన్నారు.

దేవగిరి ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు



ఏసీ కోచ్ బోగీ నుంచి వస్తున్న పొగ

భైంసా(ముథోల్): దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలుకు సోమవారం తృటిలో ప్రమాదం తప్పింది. ముంబయి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న రైలు ఉదయం 11గంటలకు ధర్మాబాద్‌కు చేరుకోగా, ఏసీ బోగీలో ఒక్కసారిగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురై బోగీ నుంచి బయటకు పరుగెత్తారు. నాందేడ్‌లోనే బోగీలో విపరీతమైన శబ్దం వచ్చిందని, నాందేడ్‌లోనే గుర్తించి స్థానిక డీసీలకు సమాచారమిచ్చినా పట్టించుకోలేదని పలువురు ప్రయాణికులు తెలిపారు. రైల్వే అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న ధర్మాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేశ్ తివారీ రైల్వే సిబ్బందిని నిలదీశారు. అనంతరం ఏసీకి సంబంధించిన పైపులు లీక్ కావడంతో పొగ కమ్ముకున్నట్లు టెక్నీషియన్లు ప్రయాణికులకు సర్దిచెప్పారు.